విశాఖపట్టణం
మంగళవారం 14 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 80 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## నిధి పోర్టల్ ద్వారా పెన్షన్లు

**జాప్యాన్ని నివారించేందుకు చర్యలు**

**మే 1 నుంచి కొత్త రూల్ అమలులోకి**



2



## పునర్విభజన దేశానికి ప్రమాదకరం

**50 శాతం పెంపుతో తీవ్ర నష్టం**

**ఉత్తరాది, దక్షిణాది మధ్య గ్యాప్ పెంచొద్దు**

**మహిళా బిల్లు, పునర్విభజనతో ఎన్డీఏ కుట్రలు**

**హైబ్రిడ్ పాలసీతో డిలిమిటేషన్ మేలు**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

(హైదరాబాద్ - జయజయహే)

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలను కలిపి చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ వ్యూహాలు పన్నుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. సచివాలయంలో డీలిమిటేషన్ అంశంపై మాట్లాడారు. మహిళాబిల్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండు అంశాలకు ఒకదానితో ఒకటి సంబంధం లేదని, ప్రతిపక్షాలు సహకరించడం లేదని ప్రచారం చేయడానికే కేంద్రం వీటిని ముడిపెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ..మిగతా 2లో


# రిజర్వేషన్లు అమలు స్ఫూర్తి

**రాజకీయాలకు మద్దతు అతీతం**

**నారీశక్తి చాటేందుకే మహిళా బిల్లు**

**ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు**





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అసలైన స్ఫూర్తితో అమలు చేసే సమయం ఆసన్నమైందని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం పార్లమెంట్ మూడు రోజులపాటు ప్రత్యేకంగా సమావేశం అవుతుందని, అన్ని పార్టీలు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన నారీశక్తి వందన్ సమ్మేళన్ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు, నారీ శక్తిని చాటిచెప్పేందుకు చారిత్రక మార్పు కోసం అందరూ చేతులు కలపాల్సిన అవసరం ఉందన్నారు. 2029లో జరగబోయే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను కచ్చితంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహించుకుంటామని ప్రధాని మోదీ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాజకీయ పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని, మహిళా రిజర్వేషన్ల చట్టంతో ముడిపడి ఉన్న సవరణ బిల్లులను ఏకాభిప్రాయంతో ఆమోదించాలని కోరారు. ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ పక్ష నాయకులకు లేఖలు రాసినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టంపై సమగ్రంగా చర్చించేందుకు తమ ప్రభుత్వం ఏప్రిల్ 16వ తేదీ నుండి మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుందని మోదీ తెలిపారు. నేటి కార్యక్రమంలో ప్రసగించిన ప్రధాని మోదీ ఎంపీలకు రాసిన లేఖలో పేర్కొన్న కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. 2029 నుండి ఈ చట్టం అమల్లోకి వస్తే దేశంలోని ప్రజాస్వామిక సంస్థలకు సరికొత్త బలం చేకూరుతుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు ..మిగతా 2లో

# టెక్నాలజీ గవర్నెన్స్

**డేటా వినియోగంపై దృష్టి సారించాలి**


**అనలిటిక్స్ ద్వారా నిర్ణయాలు తీసుకోవాలి**

**సీఎం చంద్రబాబు మార్గదర్శకం**

**ఆర్టీజీఎస్ పై సచివాలయంలో సమీక్ష**

(అమరావతి - జయజయహే)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ ఆర్టీజీఎస్ సమావేశం జరిగింది. వెలగపూడి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో డేటా ..మిగతా 2లో






## చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతలు

2

**ఐదు కోట్ల ఆకాంక్ష నెరవేర్చారు**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు టీడీపీ ధన్యవాదాలు**



## కేబినెట్ ప్రక్షాళన?

**మున్సిపల్ ఎన్నికల ముందు కొత్త టీమ్**

**కేబినెట్ అజెండా లీక్ తీవ్రంగా పరిగణ**

**రెండేళ్ల పనితీరుతోనూ కొలమానం**

**క్రమశిక్షణ తప్పితే సహించేది లేదనే సంకేతం**

**రాజకీయవర్గాల్లో జోరుగా ప్రచారం**

(అమరావతి - జయజయహే)

రాజకీయాల్లో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులపై ప్రదర్శిస్తున్న అసహనం కేవలం పరిపాలనాపరమైన కోపమే కాకుండా, రాబోయే భారీ రాజకీయ మార్పులకు సంకేతంగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవలి కేబినెట్ సమావేశంలో కేబినెట్ అజెండా మీడియాకు లీక్ అవ్వడంపై ఆయన స్పందించిన తీరు, మంత్రుల ..మిగతా 2లో

## ఏఐ టెక్నాలజీతో చందనోత్సవం

**పకడ్బందీగా వేడుకలు నిర్వహిస్తాం**

**నిరంతర పర్యవేక్షణ చేపడతాం.. హోం మంత్రి అనిత సమీక్ష**



(సింహాచలం - జయజయహే)

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న స్వామివారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని ..మిగతా 3లో

## ఏసీబీ కస్టడీకి శాంతి

**అక్రమాస్తులపై ప్రశ్నించనున్న అధికారులు**



2



## క్వాంటంలో సరికొత్త అధ్యాయం

2

**టెస్టింగ్ రిఫరెన్స్ ఆవిష్కరణ నేడు**

**ఎస్ ఆర్ ఎంలో విష్కృతం చేయనున్న సీఎం**

# పునర్విభజన దేశానికి ప్రమాదకరం




**మొదటి పేజీ తరువాయి...**

మొదటి నుంచి మహిళల రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉందని, గతంలోనే రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారని గుర్తు చేశారు. సోనియా గాంధీ హయాంలో మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినా, అప్పట్లో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో ఆగిపోయిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ల అమలును 2026 జనాభా లెక్కల తర్వాతే చేపడతామని చెప్పడం మహిళలను వంచించడమేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే ఈ రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే 181 మంది మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యే అవకాశం ఉండేదన్నారు. జనాభా లెక్కలతో సంబంధం లేకుండా, ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే వెంటనే మహిళా కోటాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాలపై ఒక రాజకీయ పావుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి జనాభాను నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం సరికాదన్నారు. గతంలో ఇందిరా గాంధీ ఈ వివక్షను గమనించే సీట్ల పెంపుపై నిషేధం విధించారని గుర్తు చేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ అంతరం విపరీతంగా పెరుగుతుందని, ఇది దేశ సమగ్రతకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు. బీజేపీ హయాంలో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రంలో కీలక పదవులు దక్కడం లేదని, పునర్విభజన జరిగితే చిన్న రాష్ట్రాలు తమ రాజకీయ మనుగడను కోల్పోతాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వివక్ష పెరగడం వల్లే ప్రాంతీయ ఉద్యమాలు వస్తాయని, బీజేపీ మళ్లీ అదే తప్పు చేస్తోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆర్థిక రాజధానులుగా ఉండి అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నాయని, రాజకీయంగా వాటి ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ మోడల్'ను ప్రతిపాదించారు. పెంచాలనుకుంటున్న సీట్లలో 50 శాతం జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50 శాతం ఆయా రాష్ట్రాల జీఎస్‌డీపీ భాగస్వామ్యం ఆధారంగా కేటాయించాలని సూచించారు. ఈశాన్య రాష్ట్రాలకు జనాభా తక్కువగా ఉన్నా ప్రాతినిధ్యం కల్పించినప్పుడు, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు అదే గౌరవం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించింది కాదని, ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. హడావుడిగా నిర్ణయాలు తీసుకోకుండా ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, నిపుణులతో కమిటీ వేసి అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో చర్చించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 2028 మార్చి వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నందున, ప్రజాస్వామ్యబద్ధంగా సంప్రదింపులు జరపాలని కోరారు. ఉత్తరాది, దక్షిణాది మధ్య గ్యాప్ పెంచేలా కేంద్రం వ్యవహరించవద్దని హితవు పలికారు.



# చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతలు

## ఐదు కోట్ల ఆకాంక్ష నెరవేర్చారు

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు టీడీపీ ధన్యవాదాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ , ఎన్డీఏ ఎంపీలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను కలిసిన లోకేష్, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అయిన అమరావతికి రాజముద్ర వేసి శాశ్వతత్వం కల్పించినందుకు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతి చరిత్ర, సంస్కృతి , మాస్టర్ ప్లాన్ వివరాలతో కూడిన ప్రత్యేక పుస్తకాన్ని ఆమెకు అందజేశారు. రాజధాని నిర్మాణం కోసం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కేవలం 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూమిని త్యాగం చేసిన రైతుల గొప్పతనాన్ని లోకేష్ రాష్ట్రపతికి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, మొక్కవోని దీక్షతో శాంతియుతంగా పోరాడారని ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి పనులు, ఎన్డీఏ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చిన తర్వాతే శరవేగంగా పునఃప్రారంభమయ్యాయని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రైతుల త్యాగాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడుతూ, రాష్ట్రంపై ప్రేమతో భూములిచ్చిన రైతుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న విజయాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని, తన హయాంలోనే అమరావతి చట్టం రూపొందడం సంతోషకరమని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు.

# నిధి పోర్టల్ ద్వారా పెన్షన్లు

## జాప్యాన్ని నివారించేందుకు చర్యలు

## మే 1 నుంచి కొత్త రూల్ అమలులోకి

(అమరావతి - జయజయహే)

ప్రభుత్వం పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. ఫైల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

# రిజర్వేషన్లు అమలు స్ఫూర్తి

**మొదటి పేజీ తరువాయి...**

రిజర్వేషన్లు కల్పించాలనే అంశం దశాబ్దాలుగా కేవలం చర్చలకే పరిమితం కాగా, తమ ప్రభుత్వం 2023లోనే దీనిపై చట్టం చేసిందని నరేంద్ర మోదీ గుర్తు చేశారు.

'నేను 2001లో కొత్తగా గుజరాత్ ముఖ్యమంత్రిని అయ్యాను. అప్పట్లో నాకు ప్రభుత్వం నడపడంలో అంతగా అనుభవం లేదు. 2002 లేదా 2003లో మా ఎమ్మెల్యే ఒకరు నా వద్దకు వచ్చి నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీకి చెందిన మహిళలు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారని చెప్పారు. ఆ పంచాయతీలోని సభ్యులందరూ మహిళలే అని చెప్పడంతో ఆశ్చర్యపోయా. వారు నన్ను కలవడానికి వచ్చినప్పుడు అది ఎలా సాధ్యమని, మీ లక్ష్యం ఏమిటి అని వారిని అడిగాను. రాబోయే 5 ఏళ్లలో ఏం చేయాలనుకుంటున్నారని అడిగాను. 8వ తరగతి వరకు చదువుకున్న ఆ మహిళా సర్పంచ్ ఇచ్చిన సమాధానం నన్ను ఆశ్చర్యపరిచింది. నేటికీ ఆమె సమాధానం నాకు గుర్తుంది. ఆమె ఏమన్నారంటే 'మా గ్రామంలో ఒక్క వ్యక్తి కూడా పేదవాడిగా మిగిలిపోకూడదు అని మేం కోరుకుంటున్నాము' అని ఆమె చెప్పారని' ప్రధాని మోదీ ఆసక్తికర విషయాన్ని ఈ సందర్భంగా షేర్ చేసుకున్నారు. దేశ జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళలకు చట్టసభల్లో రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తీసుకురావడంపైనే ఫోకస్ చేసినట్లు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతి కోసం నిర్వహించే ఈ ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో ఎంపీలంతా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమైన అంశానికి మద్దతు తెలిపి, ఈ చరిత్రాత్మక మార్పునకు నాంది పలకాలని కోరారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని బీజేపీ తమ పార్టీ ఎంపీలకు విప్ సైతం జారీ చేసింది.

# కేబినెట్ ప్రక్షాళన?

**మొదటి పేజీ తరువాయి...**



పనితీరుపై ఆయన ఇస్తున్న రేటింగ్స్.. త్వరలోనే ఏపీ మంత్రివర్గంలో మార్పుచేర్పులు ఉండబోతున్నాయనే అంచనాలను బలపరుస్తున్నాయి. సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో, అజెండాలోని కీలక అంశాలు అధికారికంగా వెల్లడించక ముందే మీడియాలో రావడంపై చంద్రబాబు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన దివంగత ఎన్టీఆర్ హయాంలో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేశారు. బడ్జెట్ వివరాలు లీక్ అయినందుకు ఎన్టీఆర్ మొత్తం మంత్రివర్గాన్నే రద్దు చేసిన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ.. గోప్యత పాటించలేని మంత్రులు ఉంటే ఎంత, లేకపోతే ఎంత అని నిలదీశారు. ఇది మంత్రులకు ఇచ్చిన ఆఖరి హెచ్చరికగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తోంది . సాధారణంగా చంద్రబాబు తన గత అనుభవాల దృష్ట్యా, ప్రభుత్వం సగం కాలం పూర్తి చేసుకునే సమయానికి మంత్రుల పనితీరుపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేస్తారు. ప్రస్తుతం మంత్రుల గ్రాఫ్, ప్రజల్లో వారి ఇమేజ్, శాఖలపై పట్టు వంటి అంశాలను ఆయన నిశితంగా గమనిస్తున్నారు. ఎవరైతే ఆశించిన స్థాయిలో పని చేయడం లేదో, వారిని తప్పించి కొత్త రక్తానికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది.

రాబోయే మూడు నాలుగు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తున్న బాబు, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు సమర్థులైన నేతలకు మంత్రి పదవులు ఇవ్వాలని భావిస్తున్నారు. కేబినెట్ అజెండాను కూడా ముందస్తుగా చదువుకోకుండా వస్తున్న మంత్రులపై ఆయన అసంతృప్తిగా ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రజల్లో మంచి మైలేజ్ ఉన్న నేతలతో కూడిన కొత్త టీమ్ ను రంగంలోకి దించే అవకాశం ఉంది.అజెండా కాపీలు ఎవరు లీక్ చేస్తున్నారో, ఏ మంత్రులు మీడియా ప్రతినిధులతో అతిగా సాన్నిహిత్యం నెరపుతున్నారో తనకు తెలుసని చంద్రబాబు సంకేతాలిచ్చారు. ఇది మంత్రులలో ఒక రకమైన భయాన్ని కల్పించింది. కేవలం లీకులే కాకుండా, శాఖా పరమైన నిర్ణయాల్లో జాప్యం, కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం వంటివి కూడా బాబు అసహనానికి కారణమయ్యాయి.

ఈసారి మంత్రివర్గ మార్పుల్లో నారా లోకేష్ మార్క్, అలాగే కూటమి ధర్మం ప్రకారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు కూడా కీలకం కానున్నాయి. యువ నేతలకు ప్రాధాన్యత పెంచడం, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడం ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వంటి అంశాల ఆధారంగా కొత్త మంత్రుల ఎంపిక ఉండవచ్చు. పనితీరు బాలేని సీనియర్లను పార్టీ బాధ్యతలకు పరిమితం చేసి, చురుకైన వారిని కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం మెండుగా ఉంది. చంద్రబాబు సీరియస్ లుక్ వెనుక ఒక పెద్ద క్లీనింగ్ ప్రాసెస్ దాగి ఉందని అర్థమవుతోంది. పరిపాలనలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారినైనా తప్పిస్తాననే సందేశాన్ని ఆయన బలంగా పంపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే లేదా రెండేళ్ల పాలన ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్‌లో భారీ మార్పులు జరగడం దాదాపు ఖాయమని చెప్పవచ్చు.



# ఏసీబీ కస్టడీకి శాంతి

## అక్రమాస్తులపై ప్రశ్నించనున్న అధికారులు

(అమరావతి - జయజయహే)

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతిపై విచారణ ముమ్మరమైంది. ఈ కేసులో ఏసీబీ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిని కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఆమెను రెండు రోజుల పాటు ఏసీబీ కస్టడీకి అప్పగించింది. ఏప్రిల్ 15, 16 తేదీల్లో ఏసీబీ అధికారులు ఆమెను విచారించనున్నారు. ప్రస్తుతం ఆమె ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. మరోవైపు.. తన వ్యక్తిగత పరిస్థితిని వివరిస్తూ శాంతి దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా కోర్టులో చర్చ జరిగింది. తనకు రెండున్నరేళ్ల చిన్న బాబు ఉన్నాడని, పసివాడు కావడంతో రోజువారీగా జైలులో ములాఖాత్‌కు(కలిసేందుకు) అనుమతించాలని ఆమె కోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న ఏసీబీ కోర్టు.. తీర్పును ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. దేవాదాయ శాఖలో కీలక పదవిలో ఉన్న శాంతి.. అధికార దుర్వినియోగానికి పాల్పడి భారీగా అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో లభించిన కీలక పత్రాలు, ఆస్తుల వివరాల ఆధారంగా ఆమెను అరెస్ట్ చేశారు. కస్టడీ విచారణలో మరిన్ని బినామీ ఆస్తులు, నిధుల మళ్లింపు వ్యవహారాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ఏప్రిల్ 16న వెలువడనున్న తీర్పు, కస్టడీ విచారణలో వెల్లడయ్యే అంశాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి.

# టెక్నాలజీ గవర్నెన్స్

**మొదటి పేజీ తరువాయి...**

డ్రివెన్ డిసిషన్ మేకింగ్‌పై ఉన్నతస్థాయి చర్చ జరిగింది. పాలనలో డేటా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ముఖ్య శాఖల కార్యదర్శులతో పాటు ఫైనాన్స్, ప్లానింగ్, వెల్ఫేర్ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేటా లేక్ నిర్మాణం, టెక్నాలజీ వినియోగం, డేటా అనలిటిక్స్ ద్వారా నిర్ణయాలు తీసుకునే విధానాలపై చర్చించారు. పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆర్టీజీఎస్ , ఏపీఎస్డీఎంఎల్ , ఏపీఎస్ఎఫ్ ఎల్ సంస్థల ప్రతినిధులతో పాటు డిజిటల్ కార్పొరేషన్, ట్రికోర్, వాసర్ ల్యాబ్స్ ప్రతినిధులు కూడా సమావేశంలో హాజరయ్యారు. అన్న క్యాంటీన్ ట్రస్ట్, గ్రామ-వార్డు సచివాలయాల అధికారులు కూడా పాల్గొన్నారు. డేటా అనలిటిక్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. అలాగే సంబంధిత అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.




# క్వాంటంలో సరికొత్త ఆధ్యాయం

(అమర్షవతి - జయజయహే)

ప్రపంచ క్వాంటం డే పురస్కరించుకుని దేశ చరిత్రలో ఓ కీలక ఘట్టానికి వేదిక కానుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా మంగళవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఆవిష్కృతం అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన అధ్యాయానికి నాంది పడనుంది. విజన్ నుంచి క్యూబిట్స్ వరకు ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును నిర్మిస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్ ఎఆర్ ఎం యూనివర్సిటీలో దేశంలోనే తొలి స్వదేశీ, ఓపెన్ యాక్సెస్ క్వాంటమ్ కంప్యూటర్లు -- చూాఝథతీఝజుఞఅ 1ూ ఢ 1ాు --ను ప్రారంభించనున్నారని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచ స్థాయి కేంద్రంగా అవతరించబోతోందని తెలిపారు. భవిష్యత్తు ఇక్కడే ఉందన్నారు. అమరావతిలో భారత్‌లో నిర్మితమై, భారతదేశానికి అందుబాటులో, ప్రపంచానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. క్వాంటమ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం : మంగళవారం గన్నవరంలోని మేధా టవర్స్‌తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్‌ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు.

# సృష్టి క్షేత్రాన్ని వరాహ నది వద్ద నిర్మించాలి






### దేవుని చెంతనే సృష్టి క్షేత్రం ఉంటే అభివృద్ధి.

### మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

**నర్సీపట్నం ప్రత్యేక ప్రతినిధి - జయ జయహే :**

పెద్ద చెరువులో 108 అడుగులతో నిర్మించబోతున్న శివపార్వతుల సృష్టి క్షేత్రాన్ని వరాహనది వద్ద నిర్మించాలని , రైతుల కోరిక మేరకు బ్రహ్మలింగేశ్వర స్వామి దేవస్థానంలో మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ , వైసిపి శ్రేణులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సీపట్నం నియోజవర్గ మాజీ శాసనసభ్యులు పెట్ల ఉ మాశంకర్ గణేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో పురాతన దేవాలయాలు ఉన్నాయని . బలిఘట్టంలో బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవాలయానికి ఓ ప్రత్యేకత సంతరించుకుందని , సాధారణంగా నదులు తూర్పు వైపు ప్రవహిస్తు ఉంటాయని , కాశీలో గంగా నది పశ్చిమ దశగా ప్రవహిస్తుందని అలాగే బలిఘట్టం ప్రాంతంలో వరాహ నది ఉత్తరం నుండి దక్షిణం కొచ్చి ఆలయం వద్ద పశ్చిమ దశకు మారుతుందని ఇది బలిఘట్టం విశేషమని తెలిపారు. ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా పిలబడుతుందని, పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు ఈ ప్రాంతంలో శివుడు విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయని తెలియజేశారు. శివరాత్రి సమయంలో దేవుని దర్శనం కోసం వేలాది మంది భక్తులు వరాహ నదిలో స్థానాల ఆచరించి దర్శించుకోవడం జరుగుతుందన్నారు. బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవస్థానం పరిసర ప్రాంతం చుట్టూ చాలా ఆలయాలు ఉన్నాయని , అన్నిటికి ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతాల్లో 108 అడుగుల శివపార్వతుల విగ్రహాన్ని ఈ ప్రాంతంలో నిర్మించాలని కోరారు. అన్నిటికీ అనుకూలంగా ఉన్న ఈ ప్రాంతాన్ని విడిచి పెద్ద చెరువులో సృష్టి క్షేత్రాన్ని నిర్మించడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. పెద్ద చెరువులో సృష్టి క్షేత్రాన్ని నిర్మిస్తే రైతులకు సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అనంతరం శివాలయంలో పంచామృతంతో పూజలు చేసిన కలశంతో వరాహ నదిలో కలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వైసీపీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.



## నిర్వాసితుల నష్ట పరిహారం కోసం
# పోస్ట్ కార్డు ఉద్యమం

**అనకాపల్లి ఏప్రిల్ 13 జయ జయ హే**

ఉత్తరాంధ్ర సుజాల స్రవంతి నిర్వాసితుల రైతులుకు 2013 ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించారు. ఈ మేరకు మూలపేట గ్రామం తుమ్మపాల రెవెన్యూ పంచాయతీ సత్యనారాయణ పురం గ్రామంలో శ్రీ గంగాలమ్మ సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో పీఎం కిసాన్ జిల్లా కన్వీనర్ రైతు నాయకులు పిలా మురళి సోమవారం మాట్లాడుతూ గత నాలుగు ఏళ్లు క్రితం సుజాల స్రవంతి భూసేకలు చేసి ఉన్నప్పటికీ భూ సేకరణ నష్టపరిహారం మంజూరు చేయలేదని భూసేకరణ నోటీసు ఇచ్చిన రెండు సంవత్సరాల లోపు నష్టపరిహారం 2013 చట్టం ప్రకారం రైతులకు ఒకటికి నాలుగు రెట్లు మార్కెట్ ధర ఆధారంగా అందజేయాలని నేటి వరకు ఎటువంటి చెల్లింపులు చేయలేదన్నారు. దీంతో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతు చట్టం 2013 చట్ట ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని ఇచ్చేలాగా ప్రభుత్వం చర్య తీసుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నో వందల సంవత్సరాల నుంచి భూములు నమ్ముకున్న వారసత్వము రైతులకు ఆధారం కోల్పోతున్న జీవన ఆధారం కోల్పోయి వ్యవసాయపరమైన జీవన వైవిధ్యం కోల్పోతున్నామని ఇబ్బందులు గురి అవుతారని భూమిని మళ్లీ వాళ్లు కోల్పోయిన తర్వాత తిరిగి సంపాదించడం చాలా కష్టమవుతున్నందున ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ ఒకటికి నాలుగు రెట్లు చట్టం ప్రకారం నష్ట పరిహారం అందజేయాలని అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సీఎం దృష్టిలో తీసుకెళ్లి నష్టపరిహారం వచ్చేలా పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం దృష్టిలోకి తీసుకెళ్లాలని చర్యలు చేపట్టాలని అదే విధంగా ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టేందుకే ఈ నిర్వాసిత రైతుల ఉత్తరాల ఉద్యమ చేపట్టామని అన్నారు. ఉత్తరాలను పూజలో పెట్టి ఆ తర్వాత ఉత్తరాలను పోస్ట్ ఆఫీస్ లో ద్వారా సీఎం ఆఫీస్ వెలగపూడి అమరావతికి సీఎం అడ్రస్ కి ఈ పోస్ట్ కార్డు ఉద్యమం చేస్తున్నట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల రైతులు పీఎం కిసాన్ జిల్లా కన్వీనర్ పిలా మురళి,ఉటా శ్రీనివాస్, శిరసుపల్లి రామకృష్ణ, పీలా గంగా నాగేశ్వరరావు పిలా ఉమామహేశ్వరరావు కరాటే శ్రీను చదరం పృథ్వి రాపేటి నూక నాయుడు పీలా అనీఫ్ ఈగల వెంకటరమణ మూలపేట మహిళా రైతులు అందరూ పాల్గొన్నారు. ఈ ఉద్యమం అనకాపల్లి మండలంలో 9 గ్రామాలు కసింకోట మండలంలో 3 గ్రామాలు సబ్బవరం మండలంలో 9 గ్రామాలు 21 గ్రామాల్లో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని కొనసాగిస్తామని అన్నారు.

## రైతు బజార్, ఆసుపత్రిని
# పరిశీలించిన ఎమ్మెల్యే

**చోడవరం ఏప్రిల్ 13 జయ జయహే**



చోడవరం నియోజవర్గం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు సోమవారం చోడవరం రైతు బజార్ పనులను పరిశీలించారు. అలాగే అక్కడ ఉన్న డ్రైనేజ్ వ్యవస్థని కూడా పరిశీలించి ఆ డ్రైనేజీని సరి చేయమని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించి అక్కడ పరిస్థితిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పడకలను పరిశీలించి వాటిని విస్తరించేందుకు గల అవకాశాల గురించి సమీక్షించరు. తదుపరి హాస్పిటల్ పై నిర్మించ తలపెట్టిన సెకండ్ ఫ్లోర్ కట్టడానికి శంకుస్థాపన చేశారు. తదుపరి చోడవరంలో అన్న క్యాంటీన్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే తగు సూచనలు చేశారు. త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# స్త్రీ శక్తి అవగాహన సదస్సు

**చోడవరం ఏప్రిల్ 13 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకశీ, ఉమెన్ ఎంపవర్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం "స్త్రీ శక్తి" అవగాహనా సదస్సు" నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వశీ, ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వము ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 2023 చట్టసభలో మహిళా బిల్లును ఉద్దేశించి, మహిళలకు చట్టసభలలో 331/2 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు చెప్పారు. 2029 ఎలక్షన్ సందర్భంగా రిజర్వేషన్ అమలు చేసే ప్రక్రియ గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చోడవరం ఏ ఎస్ ఐ, డి ఎస్ ఎం కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని సమాజంలో జరుగుతున్న మంచి చెడ్డలను అవగాహన కలిగించుకొని, తనను తాను తీర్చిదిద్దుకున్నప్పుడే మహిళా సాధికారిక సాధ్యపడుతుందని విద్యార్థులకు సూచించారు. మహిళా పోలీస్ పద్మ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఇతర చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ డిఎస్ఎన్ కుమారి ఇతర అధ్యాపక బృందం అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. అనంతరం అంబేద్కర్ రచించిన పుస్తక రచనలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతుల ప్రధానం చేశారు. ఆంగ్ల అధ్యాపకులు హెచ్వో డి డాక్టర్ మల్లి బాబు , వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, సమన్వయకర్త డాక్టర్ నారాయణ మూర్తి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి.మాల్యాద్రి,బి.పిచ్చమ్మ, సీనియర్ అధ్యాపకులు హెచ్ సుదీర్, వి అప్పల నాయుడు, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రీ వెంకటేష్,సరస్వతీ, రామలక్ష్మి, కోమల, కామర్స్ శ్రీనివాసరావు, డాక్టర్ సంతోష్, హేమ గణేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## చెట్టుపల్లిలో నేత్ర రోగులకు
# ఉచిత కళ్లద్దాల పంపిణీ

**నర్సీపట్నం ఏప్రిల్ 13 జయ జయహే**

నర్సీపట్నం మండలం చెట్టు పల్లి గ్రామంలో సోమవారం కూటమి నాయకుల సారధ్యంలో నర్సీపట్నం శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి అద్దాలు పంపిణీచేశారు. ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 220 మందికి కంటి వైద్య పరీక్షలు చేయడం జరిగిందని అత్యవసరమైన ఆపరేషన్ నిమిత్తం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి లో 12 మంది రోగులకు విజయవంతంగా ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. వీరితో పాటుగా 70మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు కూటమి నాయకులు చేతుల మీదుగా అందించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. నర్సీపట్నం కిరణ్ కంటి ఆసుపత్రి వారు చేస్తున్న కంటి వైద్య సేవలు అభినందనీయమని ఈ కార్యక్రమము సమన్వయపరిచిన బొల్లాప్రగడ ధనలక్ష్మి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, మాజీ సర్పంచ్ గజాల నాగరత్నం సూరిబాబు, నర్సీపట్నం మండల వైస్ ఎంపీపీ రత్నం రమణ, జనసేన సీనియర్ నాయకులు మోపాడ సత్య ప్రసాద్, ఎర్ర ఈశ్వరరావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు కలిమి సత్తిబాబు, సామల తాతీయులు, పసుపులేటి అప్పలనాయుడు, ఎలంకాయల తాతీలు, నర్సీపట్నం శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది , ఎర్రం శెట్టి పాపారావు పాల్గొన్నారు.



# ఏఐ టెక్నాలజీతో చందనోత్సవం

మొదటి పేజీ తరువాయి...

సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. చందనోత్సవం సందర్భంగా భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ నిర్వహించడంతో పాటు, ఆధునిక ఏఐ టెక్నాలజీని వినియోగించాలన్నారు.భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ ఏర్పాట్లు పరిశీలనలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, చందనోత్సవం ఒక అపురూపమైన ఘట్టమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని చెప్పారు. గత సంవత్సరం సుమారు 1.20 లక్షల మంది భక్తులు హాజరయ్యారని, ఈసారి దాదాపు 2 లక్షల మంది భక్తులు రానున్నారని అంచనా వేస్తున్నాం అని తెలిపారు. సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని,అంతరాలయ దర్శనం ఉదయం 5 గంటల వరకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం 10 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పిస్తున్నాం అని మంత్రి వెల్లడించారు.

## విజయవంతమైన
# సర్జరీలతో రోగులకు ఉపశమనం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



అనుభవం, నైపుణ్యం, సేవా భావం కలగలిపిన వైద్యురాలిగా డాక్టర్ సౌమ్య ప్రసిద్ధి చెందింది. శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్‌లో ఎంఎస్ జనరల్ సర్జరీ వైద్యురాలిగా సేవలందిస్తున్న ఆమె, ఎన్నో విజయవంతమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ రోగుల విశ్వాసాన్ని పొందుతున్నారు.సర్జరీలలో మంచి అనుభవం కలిగిన డాక్టర్ సౌమ్య, రోగులతో స్నేహపూర్వకంగా మెలిగి వారికి ధైర్యం నింపడం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఇటీవల లాప్రోస్కోపిక్ విధానంలో గాల్ బ్లాడర్‌లో ఉన్న రాళ్లను తొలగించి ఒక రోగికి ఉపశమనం కలిగించడం ద్వారా మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు.అలాగే లాప్రోస్కోపిక్ ఆపెండికెక్టమీ, కోలెసిస్టెక్టమీ, హెర్నియా శస్త్రచికిత్సలు, గర్భాశయ సంబంధిత కణితులు, రొమ్ములో గడ్డలు, వరిబీజం, ఫైల్స్, ఫిస్టులా వంటి పలు రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ డి.డి. నాయుడు మాట్లాడుతూ, డాక్టర్ సౌమ్య అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తమ ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో 9247875661 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



## మల్లయ్యపేటలో
# ఇసుక దందాపై వైసీపీ ఆగ్రహం

### కలెక్టర్‌కు వినతి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం నగరంలోని మల్లయ్యపేట ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, ఇసుక దందా అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.ఇసుక లారీలు టార్పాలిన్ కవర్లు లేకుండా సంచరిస్తూ రోడ్లపై ఇసుక చిందించడం వల్ల దుమ్ము, ధూళి పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని తెలిపారు. వేగంగా నడిచే లారీల వల్ల ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.అనుమతి లేని ర్యాంపుల నుంచి ఇసుక రవాణా జరుగుతోందని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని అన్నారు. మల్లయ్యపేట, పేపర్ మిల్ రోడ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ఇసుక లారీలపై నియంత్రణ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు, ప్రజల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు.

# అంబేడ్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి!



## బాబా సాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ 135వ జన్మదిన శుభాకాంక్షలతో...

**రచన: ప్రొఫెసర్. విశ్వేశ్వర రావు చెనమల్లు**

చరణం:
'అంబేద్కర్ మార్గం -- మన గమ్యం,' అంటే కాదనగలమెంటోయ్
అందుకే, 'జై భీమ్ -- జై భారత్,' అని నినదించడానికి సిగ్గెందుకోయ్

పల్లవి:
సంస్కర్తయై, అంటరానితనం, అస్పృశ్యతలపై యుద్ధభేరిని మ్రోగించాడు
అణచివేతకు ప్రతిఘటనై, దళిత, అణగారిన వర్గాలకు గొంతైనాడు
చీకటిలో వెలుగై, పీడిత తాడిత, బాధిత వర్గాలకు దిక్సూచై నిలిచాడు
బలహీనుల బలమై, పేద, శోషిత వర్గాల గళమై వారికి శక్తయినాడు
న్యాయ కోవిదుడై, మహిళా అభ్యున్నతికి, కార్మిక హక్కులకై పోరాడాడు

చరణం:
'అంబేద్కర్ మార్గం -- మన గమ్యం,' అంటే కాదనగలమెంటోయ్
అందుకే, 'జై భీమ్ -- జై భారత్,' అని నినదించడానికి సిగ్గెందుకోయ్

పల్లవి:
సమానత్వమే లేకుంటే, అసలు మానవ సమాజానికి స్వేచ్ఛే లేదన్నాడు
'సమానత్వం మన హక్కు' అంటూ, ఆ హక్కు కోసం ఒక్కటౌదామన్నాడు
స్వేచ్ఛ, సమన్యాయం, సమానత్వం, సమసమాజ పునాదులన్నాడు
సమత్వం, సమదృష్టి, సమభావం, సమాన స్థితి మన లక్ష్యం కావాలన్నాడు
చదువు, సంఘటితం, ఐక్యత, పోరాతాలతోనే సమానత్వం సాధ్యమన్నాడు

చరణం:
'అంబేద్కర్ మార్గం -- మన గమ్యం,' అంటే కాదనగలమెంటోయ్
అందుకే, 'జై భీమ్ -- జై భారత్,' అని నినదించడానికి సిగ్గెందుకోయ్

పల్లవి:
చదువుతో వెలుగన్నాడు, అదే సమసమాజానికి దారి చూపే జ్యోతన్నాడు
చదువే దివ్యామృతం అన్నాడు, అదియే సమసమాజ స్థాపనకు వరమన్నాడు
చదువే అణగారినవారి విముక్తి మార్గం, వారిని స్వాలంబులుగా మారుస్తుందన్నాడు
జ్ఞానమే మన బలమన్నాడు, ఆ జ్ఞానమే దారిద్ర్య దహనానికి ఉపకారి అన్నాడు
'చదువు-ఎదుగు-పోరాడు,' అదియే శాశ్వత మార్గమని గట్టిగా నినదించాడు

చరణం:
'అంబేద్కర్ మార్గం -- మన గమ్యం,' అంటే కాదనగలమెంటోయ్
అందుకే, 'జై భీమ్ -- జై భారత్,' అని నినదించడానికి సిగ్గెందుకోయ్

**అంబేడ్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది.**

న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితో ద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన



గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్థాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు.

అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేళ మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ఃాబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. ఆయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్దాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు.


తరువాత కొద్ది రోజులకి అనారోగ్యం కారణంగా 1956 డిసెంబర్ 6 వ తేదీన అంబేద్కర్ మరణించారు. ఆయన మరణించినగాని ఆయన కృషి ఇప్పటికీ ఎంతో మంది జీవితాలలో వెలుగుని నింపుతుంది. ఒకవేళ ఆయన పూనికుని ఉండకపోతే ఈనాటికి బడుగు బలహీన వర్గాల జీవితాలు ఇంకా అలాగే ఉండిపోయే వేమో.

# సంగీత సామ్రాజ్ఞి ఆశా భోస్లే

(సి.హెచ్.ప్రతాప్)

**భారతీయ సంగీత ప్రపంచంలో అజరామరమైన గాత్రంతో చిరస్థాయిగా నిలిచిన గానకోకిలలలో ఆశా భోస్లే పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆమె స్వరంలో ఉన్న మాధుర్యం, భావప్రకటనలోని చైతన్యం, శైలిలోని వైవిధ్యం ఆమెను ఇతర గాయనిల నుండి విభిన్నంగా నిలబెట్టాయి. సుమారు ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రయాణం భారతీయ సినీ సంగీత చరిత్రలో ఒక అపూర్వ అధ్యాయం. 1933లో మహారాష్ట్రలో జన్మించిన ఆశా భోస్లే చిన్ననాటి నుంచే సంగీత వాతావరణంలో పెరిగారు. ఆమె తండ్రి పండిత్ దీనానాథ్ మంగేష్కర్ ప్రసిద్ధ శాస్త్రీయ గాయకుడు. అక్క లతా మంగేష్కర్ కూడా సంగీత ప్రపంచంలో అగ్రస్థానాన్ని అలంకరించడం ఆమెకు ప్రేరణగా నిలిచింది. చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు భుజాన వేసుకొని గానం ప్రారంభించిన ఆశా, క్రమంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆరంభంలో ఆమెకు లభించిన అవకాశాలు తక్కువైనా, పట్టుదలతో శ్రమించి తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకున్నారు.**

ఆమె గాత్ర విశిష్టతలో ప్రధానంగా కనిపించేది అద్భుతమైన వైవిధ్యం. శాస్త్రీయ సంగీతం నుండి పాశ్చాత్య శైలుల వరకు, గజల్ నుండి కేబరే పాటల వరకు ఆమె సమాన నైపుణ్యంతో పాడగలగడం విశేషం. ముఖ్యంగా సంగీత దర్శకుడు ఆర్.డి. బర్మన్‌తో ఆమె చేసిన అనేక కృతులు నేటికీ శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుంటాయి. "పియా తూ అబ్ తో ఆజా", "దమ్ మారో దమ్", "చురా లియా హై తుమ్నే" వంటి పాటలు ఆమె గాత్రానికి చిరస్థాయి గుర్తింపును తెచ్చాయి. అలాగే గజల్ శైలిలో "ఇన్



ఆంఖోం కి మస్తీ", "దిల్ చెజ్ క్యా హై" వంటి పాటలు ఆమె భావవ్యక్తీకరణకు అద్దం పట్టాయి. లతా మంగేష్కర్ గొంతులో ఉండే పవిత్రతకు భిన్నంగా, ఆశా గొంతులో ఉండే చలాకీతనం, ఆధునికత ఆమెను విభిన్న శ్రేణి శ్రోతలకు చేరువ చేశాయి. ఆమె కేవలం ఒక గాయని మాత్రమే కాదు, స్వరంతో అభినయించే గొప్ప కళాకారిణి.

ఆశా భోస్లే ఇప్పటివరకు వేలాది పాటలు పాడారు. అధికారిక గణాంకాల ప్రకారం ఆమె 20,000కు పైగా గీతాలను ఆలపించి ప్రపంచంలో అత్యధికంగా పాటలు పాడిన గాయనులలో ఒకరిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో గుర్తింపు పొందారు. హిందీతో పాటు మరాఠీ, బెంగాలీ, గుజరాతీ, పంజాబీ, తమిళం, తెలుగు వంటి అనేక భాషల్లో ఆమె గానం వినిపించింది. తెలుగులో కూడా ఆమె పాడిన పాటలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆమె స్వరంలో ఉన్న నాటకీయత, రసభరితత ప్రతి పాటకు ప్రత్యేకమైన జీవం పోస్తాయి. పాశ్చాత్య బాణీలను భారతీయ మూలాలతో మేళవించి పాడటంలో ఆమెకు సాటిలెవరూ లేరు. తన సుదీర్ఘ ప్రయాణంలో ఎంతోమంది సంగీత దర్శకులతో పనిచేసి, మారుతున్న కాలానికి అనుగుణంగా తన గాత్ర ధర్మాన్ని మార్చుకుంటూ నవతరాన్ని కూడా అలరించారు.

పురస్కారాల పరంగా కూడా ఆమె అనేక గౌరవాలను అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆమెను పద్మ విభూషణ్ పురస్కారంతో గౌరవించింది. అదేవిధంగా అత్యున్నత దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కూడా ఆమె కైవసం చేసుకున్నారు. అనేక జాతీయ చలనచిత్ర పురస్కారాలను, ఫిలింఫేర్ అవార్డులను ఆమె గెలుచుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆమెకు ఎనలేని గుర్తింపు లభించింది. ఆమె గాత్ర శైలి ప్రత్యేకత ఏమిటంటే, పాటలోని క్లిష్టమైన భావాన్ని సైతం శ్రోతల హృదయానికి హత్తుకునేలా వ్యక్తీకరించడం. ప్రేమ, విషాదం, ఉత్సాహం, వినోదం--- ఏ భావమైతే ఉండాలో, అది ఆమె గాత్రంలో అత్యంత సహజంగా ప్రతిబింబిస్తుంది.

సంగీతం పట్ల అచంచలమైన నిబద్ధత, నిరంతర సాధన, ప్రయోగాల పట్ల ఆసక్తి---ఈ మూడు లక్షణాలు ఆశా భోస్లేను ఒక చిరస్మరణీయ గాయనిగా నిలబెట్టాయి. వయసు పైబడినప్పటికీ ఆమె స్వరంలోని స్వచ్ఛత తగ్గకపోవడం ఆమె అంకితభావానికి నిదర్శనం. నేటికీ ఎంతోమంది వర్ధమాన గాయనీగాయకులకు ఆమె ఒక మార్గదర్శి. ఏడు దశాబ్దాలుగా భారతీయ సినీ ప్రపంచాన్ని తన పాటలతో ఓలలాడించిన ఆమె కృషి అనన్యసామాన్యం. ఆమె గాత్రం భారతీయ సంగీత సంపదలో ఒక అమూల్య రత్నంగా, భావి తరాలకు ఒక గొప్ప స్ఫూర్తిగా నిలిచిపోతుంది.

## అంబేద్కర్ 135వ జయంతి...
# అజయ్‌పురం గ్రామంలో బైక్ యాత్ర ప్రారంభం



**అనకాపల్లి,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం., కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు.అజయ్ పరువు నుండి జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా వరకు బైకే యాత్ర నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలని, నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రావికతం మండల కేంద్రంలో సర్వేనెంబర్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న చెత్తను తొలగించాలి. బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41-లో 5-80 చెట్లు భూమిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దళితులకు, గిరిజలకు కేటాయించాలి బాదంపాడు రెవిన్యూ పరిధిలో సీలింగ్ భూమి చుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలని తెలిపారు. దళితులకు గిరిజనులకు పట్టాలి ఇవ్వాలి. కొత్తకోట దళిత కాలనీకి మంచినీరు సౌకర్యం కల్పించాలి. గిరిజనులు సాగులోన భూములకు, సాగకు కల్పించి, గిరిజనులకు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మోనాటరింగ్ కమిటీలో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని, జెడ్ జోగంపేట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నర్సీపట్నం నుండి జెడ్ జోగిపేట్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, దళితులకు గిరిజనులకు ఇచ్చిన అధిక బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దళితులకు గిరిజనులకు నర్సీపట్నంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సాయి కార్యదర్శి కే గోవిందరావు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రరావు. పాంగి పవన్ కుమార్. వంతల చిరంజీవి. గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.

# డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి వారోత్సవ వేడుకలు





**విశాఖపట్నం (జయ జయహే )**

విశాఖపట్నం కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వారోత్సవాలు పురస్కరించుకుని, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, డాక్టర్ అంబేద్కర్ సేవలను కొనియాడారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించి, దేశానికి మౌలిక హక్కులు మరియు సమానత్వం వంటి మానవత విలువలను అందించారు. అంబేద్కర్ అద్భుతమైన కృషి వల్లే భారత దేశం ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిచింది" అని పేర్కొన్నారు. అలాగే, "ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను గౌరవించి, ఉన్నత విద్యను అభ్యసించి, దేశ మరియు సమాజ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి" అని పాఠకులను ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన, అంబేద్కర్ వాది గౌరవ అతిథి బి ఎల్ నారాయణ కు బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటంతో ఘనంగా సత్కరించిన చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్, కార్యదర్శి బుర్రి కుమార్ రాజా, మండల విద్యాశాఖ అధికారి పైడి రాజు, గ్రంథాలయాల పెన్షనర్స్ ప్రెసిడెంట్ పోతు మల్లేశ్వరావు, కాకి అప్పారావు,డిప్యూటీ లైబ్రేరియన్ తిరుమల కుమారి, నగరంలోని శాఖ గ్రంథాలయాల గ్రంథ పాలకులు పీవీఎన్ రాజు, ఎంవీ నరసింహం, పోలితల్లి,మరియు సిబ్బంది రాజేంద్ర వర్మ,అరుణ పాఠకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఈపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్‌కి 45 వినతులు

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, జయ జయహే**

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి వినియోగదారుల నుంచి 45 వినతులు అందాయి. కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వినియోగదారులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాకు సంబంధించి లో-వోల్టేజ్, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, రూఫ్ టాప్ సోలార్ కు సంబంధించిన సమస్యలు, విద్యుత్ కనెక్షన్ల మంజూరు తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినతులను సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాలకు ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సంస్థ సూచించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, సీజీఎం వి.విజయలలిత, జీఎం వి.వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా నేత పేరాడ తిలక్ పోలీస్ నిర్బంధం

### టెక్కలి పోలీస్ స్టేషన్ వద్ద బైటయించిన వైయస్సార్సీపి శ్రేణులు

### పోలీసులకు వైకాపా కార్యకర్తలకు మధ్య ఉద్రిక్తత

**టెక్కలి ఏప్రిల్ 13 జయ జయహే**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై నిరసిస్తూ టెక్కలి నియోజకవర్గం ఇన్చార్జ్ పేరాడ తిలక్ అచ్చం నాయుడు పై విమర్శలతో ధ్వజమెత్తారు, దీనిపై స్పందించిన కూటమి నేతలు చేసిన ఫిర్యాదు మేరకు టెక్కలి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పేరాడ తిలక్ కు నోటీసులు ఇచ్చి టెక్కలి పోలీసులు సోమవారం విచారణ పేరిట నిర్భందించారు, తిలక్ ను ఎంతసేపటికి విడుదల చేయకపోవడంతో టెక్కలి, సంతబొమ్మా లి, నందిగాం, కోటబొమ్మాలి వైయస్సార్సీపి కార్యకర్తలు భారీగా తరలివచ్చి టెక్కలి పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగి బైఠాయించారు కొద్దిసేపు పోలీసులకు వైసీపీ శ్రేణులకు మధ్య ఉద్రిక్తత ఏర్పడింది, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆరంగి లక్ష్మీపతి, టెక్కలి జడ్పిటిసి దువ్వాడ వాణి, నందిగాం ఎంపీపీ శ్రీరామ్మూర్తి, అన్నెపు రామారావు, మాణిక్యాలరావు, వెంకటేశ్వరరావు,వైకాపా ప్రతినిధి కురమాన బాలకృష్ణారావు, సత్తారూ సత్యం తదితరులు పాల్గొన్నారు.

## హుద్ హుద్ భవనాల వైపు లబ్ధిదారుల చూపులు

### అలసత్వంతో ఎనిమిదేళ్లయినా అందని ఇళ్ళు

### కూటమి ప్రభుత్వమైన కరుణించాలని విన్నపాలు

**టెక్కలి ఏప్రిల్ 13 జయ జయహే**



శ్రీకాకుళం జిల్లా టెక్కలి, పలాస మండలా ల్లో పూర్తయిన హుద్ హుద్ తుఫాను భవనాలు నిర్మాణాలు చేపట్టి ఎనిమిదేళ్లు గడుస్తున్నప్పటికీ అలసత్వంతో ఇళ్ళు పంపిణీలో జాప్యం జరుగుతుంది, ఎవరి లోపమో కొండంత ఆశతో ఉన్న లబ్ధిదారులకు శాపమై నిరీక్షణతో ఎదురుచూపులే మిగులుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, పలాస, నియోజక వర్గాలలోని హుద్ హుద్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సుమారు 390 ఇళ్ళ నిర్మాణాలకు 2014 లో ప్రతిపాదనలు చేసి 2019 నాటికి అప్పటి ప్రభుత్వం పూర్తి చేశారు, నేటికీ ఎనిమిదేళ్లు పూర్తికావచ్చినప్పటికీ ఈ ఇల్లు పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతుంది లోపం ఎక్కడో తెలియని పరిస్థితులు నెలకొని ఉన్నాయి, ఇళ్ళ నిర్మాణం జరిగినప్పటికీ ఇంకా మౌలిక సదుపాయాల కల్పనలు అసంపూర్తిగా ఉన్నాయి, కూటమి ప్రభుత్వ మై నా ఇంకా జాప్యం చేయకుండా అర్హులైన లబ్ధిదారులకు ఈ భవనాలు అంకితం చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతూ ఉన్నారు.

## పర్యాటక ప్రాంతాలు, జలవనరుల వద్ద భద్రతా చర్యలు

### జిల్లా కలెక్టర్ నిశాంతి. టి

**పాడేరు,(జయ జయహే)**



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో మునిగిపోవడం (చనిపోవడం జరుగుతుంది)వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి జిల్లా కలెక్టర్ కఠినమైన ఆదేశాలను జారీ చేశారు. ముఖ్యంగా పాడేరు, అరకు ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా పర్యాటకులు, విద్యార్థులు జలవనరుల వద్దకు వెళ్లే అవకాశం ఉన్నందున, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు జిల్లాలోని కాలువలు, జలపాతాలు, చెరువుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రిస్క్ మ్యాపింగ్ చేసి శుక్రవారం లోపు ఐటిడిఏ పాడేరు కి నివేదిక సమర్పించాలి. సరియ, చాపరాయి, రానజిల్లెడ , కొత్తపల్లి జలపాతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. రక్షణ ఏర్పాట్లు లోతైన ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, వెదురు కంచెలు లేదా తాళ్ళతో బారికేడ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

**విద్యార్థులకు అవగాహన**

పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం ప్రార్థన సమయంలో (అసెంబ్లీలో) 5 నిమిషాల పాటు నీటి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. "తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా నీటిలోకి దిగవద్దు" అనే సందేశాన్ని బలంగా పంపాలి. హాస్టల్ విద్యార్థులపై వార్డెన్లు ప్రత్యేక నిఘా ఉంచాలి.

కట్టుదిట్టమైన నిఘా వారాంతాల్లో (వీకెండ్స్ ) పర్యాటక ప్రాంతాల వద్ద రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ సిబ్బందితో సంయుక్తంగా గస్తీ నిర్వహించాలి. మద్యం సేవించి నీటిలోకి వెళ్లే వారిని అడ్డుకోవడానికి 'బ్రీత్ అనలైజర్' తనిఖీలు చేపట్టాలి.

అత్యవసర సేవల సిద్ధం ప్రతి మండలంలో స్థానిక ఈతగాళ్ల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలి. అరకు, అనంతగిరి ప్రాంతాల్లో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలి.

**జిల్లా కలెక్టర్ హెచ్చరిక**

జిల్లా లో నిర్లక్ష్యం కారణంగా ఒక్క మరణం సంభవించినా సహించేది లేదు. ఆదేశాల అమలులో విఫలమైతే డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ మేరకు ప్రతి మండలం తమ 'మైక్రో ప్లాన్' తో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి హాజరుకావాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలు మరియు ఎస్.హెచ్.ఓ లను ఆదేశించారు.



## జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌ను కలిసిన నూతన డీఎస్పీలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు సౌత్ జోన్ డీఎస్పీ ఏ. శివప్రియ, నార్త్ జోన్ డీఎస్పీ సి.హెచ్. జీవన జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ డీఎస్పీలను అభినందించి, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు.



## అంబేద్కర్ జయంతి సందర్భంగా సామాజిక చైతన్య బైక్ యాత్ర

**చోడవరం ఏప్రిల్ 13 జయ జయహే**

రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం. కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం అజయ్ పురం గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అజయ్ పురం నుండి జెడ్ జోగంపేట,నేరేడు బంధ, కళ్యాణ్ లోవ వరకు బైకే యాత్ర నిర్వహించారు. నో మైనింగ్ జోన్ గా కళ్యాణ్ లోవా ప్రాంతాన్ని ప్రకటించాలని, ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలనీ,నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలనీ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనీ డిమాండ్ చేశారు. రావికమతం మండల కేంద్రంలో సర్వేనెంబర్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న చెత్తను తొలగించాలనీ, బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41-లో 5-80 చెట్లు భూమిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దళితులకు, గిరిజనులకు కేటాయించాలనీ, బాదంపాడు రెవిన్యూ పరిధిలో సీలింగ్ భూమి చుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలనీ, దళితులకు గిరిజనులకు పట్టాలి ఇవ్వాలనీ,కొత్తకోట దళిత కాలనీకి మంచినీరు సౌకర్యం కల్పించాలనీ,గిరిజనులు సాగులోన భూములకు సాగకు కల్పించి గిరిజనులకు దళితులకు రక్షణ కల్పించాలనీ కోరుతున్నారు, ఈ కార్యక్రమశీలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సాయి కార్యదర్శి కే గోవిందరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రావు, పాంగి పవన్ కుమార్,వంతల చిరంజీవి, గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు



## తక్షణం తాగునీటి సమస్య పరిష్కరించాలి

### లకే అబ్బాయి దొర


**పాడేరు( జయ జయహే) ఏప్రిల్ 13**

పాడేరు మండలం కుజ్జెలి పంచాయతీ పరిధిలోని రాములు పుట్ గ్రామంలో తీవ్రమైన తాగునీటి కొరత నెలకొన్నది. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు లకే అబ్బాయి దొర రిటైర్డ్ ఆర్మీ ఇంజనీర్ ,బీజేపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు.సోమవారం మనఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా రాములు పుట్ సందర్శించిన , ఈ సందర్బంగా పత్రిక ప్రకటన విడుదల చేశారు, రాములు పుట్ గ్రామంలో మంచినీటి బోరు పరిశీలించారు, తక్షణం చేతి బోరు ద్వారా నీటి సరఫరా అయ్యే లా చేయడం, బోర్లు పునరుద్ధరించడం వంటి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.అలాగే, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా శాశ్వత నీటి వనరులను అభివృద్ధి చేయాలని, గ్రామ ప్రజలకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.జలజీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా ఇబ్బందిగా ఉందని రెండు బిందెలు నీరు వస్తుంది అని గ్రామస్తులు తెలిపారు అని ఈ సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జలధార-జల హారతి నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ

### జిల్లా కలెక్టర్ నిషాంతి . టి

**పాడేరు (జయ జయహే)**



జిల్లాలో భూగర్భ జల మట్టాలను పెంచడం, చెరువులు, జలాశయాలను పునరుద్ధరించడం లక్ష్యంగా "జలధార-జలహారతి" కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ నిషాంతి .టి ఆదేశించారు. సోమవారం తన చాంబర్ నుండి సంబంధిత జిల్లా అధికారులతో జలధార జల హారతి కార్యక్రమం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆమె మాట్లాడుతూ 100 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో, ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో సాగునీటి వ్యవస్థలను బలోపేతం చేసే కార్యక్రమమని, నీటి వనరులకు సాంకేతికతతో అనుసంధానించి నీటి వనరుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, చెరువుల ఆధునీకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు, శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, జిఐఎస్ (జిఐఎస్) ఆధారిత మ్యాపింగ్ ద్వారా సమగ్ర నీటి నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఈ కార్యక్రమానికి అనుసంధానం చేయడం జరిగుతుందన్నారు.దెబ్బతిన్న చెరువులు, లీకేజీ ఉన్న చెక్ డ్యామ్‌లను ప్రాధాన్యంతో పునరుద్ధరించడంతో పాటు, అనుకూల ప్రదేశాల్లో కొత్త సాగు నీటి చెరువుల ఏర్పాటుకు సాధ్యతను పరిశీలించాలని ఆదేశించారు.చెరువుల కట్టలను బలోపేతం చేస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టాలని, కాలువలలోని పూడికను తొలగించాలని, తూములు, మరమ్మత్తుల పనులు వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలు,సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి కెఆర్ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠ రావు,జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, భూగర్భ మరియు జలగణన శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస్, డ్వామా పిడి విద్యా సాగర్, జిల్లా ఇంచార్జ్ అటవీ శాఖ అధికారి ఉమా మహేశ్వరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కరుణాకర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డ్ కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి.ఎస్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి చంద్ర శేఖర్, ఏపిఈపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# మావిగన్ ప్రజా రాజధానికి ప్రజల మద్దతు

## డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ

**విశాఖపట్నం జయ జయహే**



వైస్సార్సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ ఏర్పాటు చేసిన పత్రిక సమావేశం లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోజుకో మాట మారుస్తూ సింగపూర్ ని మరిపించేలాఅత్యుత్తమైన డిజైన్లు రూపొందిస్తున్నామని గతంలో కేవలం డిజైన్లకే 410 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని.ఇప్పుడు మరలా ఆ డిజైన్లు పనికిరావని డిజైన్లన్నీ కొత్తగా మార్పిస్తూ , కేవలం 50 వేల ఎకరాలలోనే గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తే 29 గ్రామాలతో మూడు నాలుగు లక్షల జనసాంద్రత కూడా లేకుండా అమరావతి మున్సిపాలిటీ గానే మిగిలి పోతుందని ప్రజలను మభ్యపెడుతూ రెండో విడత భూసేకరణ పేరుతో మొదట విడత స్థలాలు ఇచ్చిన రైతుల సమస్యలు పూర్తి చేయకుండా మరల 50 వేల ఎకరాలు సేకరించి సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం పేరుతో రెండవ విడత సేకరించే 50 వేలఎకరాలను బ్యాంకులలో తాకట్టు పెట్టి గ్రీన్ ఫీల్డ్ రాజధానిని ముందుకు తీసుకు వెళ్దాం అనే ఆలోచన చేస్తూ, ప్రస్తుతరాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తుంది అంటూ, ఇంత తొందరలో రాజధాని నిర్మించలేము అని అనుమానాలు బహిరంగంగా వ్యక్తం చేయడం వల్ల రాష్ట్ర ప్రజలందరూ భవిష్యత్తు కలల రాజధాని అమరావతి విషయంలో సందిగ్ధంలో పడిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కు ప్రజలు ,మేధావులు, ఆర్థికవేత్తలు, సోషల్ మీడియా మరియు రాజకీయ వ్యాపార వర్గాల్లో మద్దతు ఎక్కువైంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మావిగన్ పైనే చర్చ జరుగుతుంది. మావిగన్ అయితేనే ప్రజా రాజధానిగా ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఇది సరైన నిర్ణయం అని భావిస్తున్నారు. వరదలు తుఫానులు విపత్తులు సంభవించే ప్రాంతంగా అమరావతిని శివరామకృష్ణ కమిషన్ వ్యతిరేకించిందని రాష్ట్ర రాజధానికి అనుకూలమైన ప్రదేశం అమరావతి కాదని తెలియజేసింది,అయినా చంద్రబాబు నాయుడు శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను బుట్ట దాఖలు చేశారని తెలియజేశారు. రాష్ట్ర పరిస్థితి దృష్ట్యా మావిగన్ ను రాజధానిగా నిర్ణయించడమ మావిగన్ ను రాజధానిగా చేయడం ఉత్తమమైన మార్గమని ప్రజలు కోరుకుంటున్నారు. నూట పది కిలోమీటర్ల మేర విస్తీర్ణంలో 35 లక్షలు నుండి 40 లక్షల మధ్య జనాభా కలిగి అన్ని మౌలిక సదుపాయలతో అన్ని వసతులు ఉన్న మావిగన్ పరిధిలో ఇప్పటికే ఆర్థిక పరంగా మరియు వ్యాపార పరంగా, వ్యవసాయం పరంగా బలమైన ప్రాంతంగా ఉన్నదని మావిగన్ ను బ్రౌన్ ఫీల్డ్ రాజధానిగా గ్రోత్ ఇంజన్ తో అభివృద్ధి పరంగా శరవేగంగా పరుగులు పెట్టించే అవకాశం ఉందని తెలియజేశారు అమరావతిలో దేశంలో ఎక్కడా లేనివిధంగా 11 వేల నుంచి 14 వేల వరకు ఎస్ ఎఫ్ టి కి కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడం జరుగుతున్నదని తెలియ చేస్తూ ప్రజాధనం దోపిడీకి దారులు తెరిచారని, కేవలం రోడ్లు వేయడానికి కిలోమీటర్ కు 53 కోట్లు చెల్లిస్తున్నారని అదే నేషనల్ హైవే అథారిటీస్ వారైతే అత్యుత్తమైన రోడ్లను 23 కోట్ల రూపాయలకే వేస్తున్నారని తెలియజేస్తూ . అమరావతికి 2 లక్షల కోట్ల వ్యయాన్ని కేవలం బేసిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కోసమే డి పిఆర్ అంచనా వేశారని ఇవి కాక భవనాల నిర్మాణాలకు అదనంగా ఖర్చు చేయవలసిన అవసరం ఉందని, రాబోయే దశాబ్దాలలో ఈ అంచనా ఎన్ని లక్షల కోట్లకు చేరే ప్రమాదం ఉందో ప్రజలు ఆలోచించుకోవాలని తెలియజేశారు. ఇప్పటికే టెంపరరీ అసెంబ్లీ పేరుతో 1100 కోట్ల ప్రజాధనం వృధా చేశారని, పక్క రాష్ట్రం తెలంగాణలో 615 కోట్లతో 28 ఎకరాల్లో అత్యద్భుతమైన రాజధానిని నిర్మించడం ఈ రాష్ట్ర ప్రజలు చూశారని తెలియజేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్ కు ఇప్పటివరకు ఏడేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఈ ఏడేళ్ల కాలంలో 8,000 కోట్ల పైచిలుకు రూపాయలు మాత్రమే అమరావతిపై ఖర్చు చేయడం జరిగిందని మొబిలిటీ అడ్వాన్సుల పేరుతో మరో 6000 కోట్ల రూపాయలను మొబలైజేషన్ అడ్వాన్స్ రూపంలో చెల్లించి కాంట్రాక్టర్ల దగ్గర అత్యధిక మొత్తంలో కమిషన్ల రూపంలో డబ్బులు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు.రాజధాని అమరావతి విషయంలో జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ పట్ల ప్రజలు సానుకూలతో ఉన్నారని తెలియజేశారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా మావిగన్ ను ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించాలని కోరారు.



## మెగా యూత్ ఫోర్స్ విస్తరణకు

# ప్రతి ఒక్క మెగా అభిమాని కృషి చేయాలి

**విజయనగరం (జయ జయహే)**

విజయనగరం జీఎస్ఆర్ హోటల్ లో నేషనల్ మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ ఏడిద బాబీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు విజయనగరం జిల్లా మెగా అభిమానుల సమక్షంలో ఏడిద బాబీకి , సీనియర్ మెగా అభిమానులకు చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ జాతీయ కన్వీనర్ ఏడిద బాబీ మాట్లాడుతూ తెలుగు రాష్టాల్లో మెగా యూత్ ఫోర్స్ ను విస్తరించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.మెగాస్టార్ చిరంజీవికి ఎంతమంది ఫ్యాన్స్ ఉన్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని. చిరంజీవికి డై హార్ట్ ఫాన్స్ ఉన్నారని, అభిమానులంటే చిరంజీవికి కూడా అంతే ఇష్టమన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ చిరంజీవి మెగాస్టారే అన్నారు.ఆయన మదర్ థెరిస్సా స్ఫూర్తితో 1998 నుండి ట్రస్ట్ ద్వారా రక్తదానం, నేత్రదానం సేవలు అందించారన్నారు. కరోనా మహమ్మారి సమయంలోనూ చిత్రపరిశ్రమ కార్మికుల్ని ఆదుకోవడం కోసం సీసీసీ సంస్థను ఏర్పాటు చేసి విరాళాలు సేకరించి సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు.మెగాస్టార్ చిరంజీవి జీవితం యువతకు, కష్టపడే తత్వానికి ఒక గొప్ప స్ఫూర్తి అన్నారు.మెగా స్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ఈకార్యక్రమం లో విజయనగరం , పార్వతిపురం, కురుపాం, శృంగవరపుకోట సాలూరు, బొబ్బిలి, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం పాలకొండ ప్రాంతాల నుండి మెగా ఫ్యామిలీ అభిమానులకు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరివాడు

**పశ్చిమగోదావరి జిల్లా( జయ జయహే)**

నరసాపురం మండలం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పాల్గొని మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అతి చిన్న వయసు నుండి అవమానాలు గురై సమాజంలో జరుగుతున్న అసమానతులపై అధ్యయనం చేసి. భారతదేశంలో ఉన్న తాడిత పీడిత బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసి కుటుంబాన్ని పిల్లలను త్యాగం చేసి ప్రపంచ మేధావుగా ఎదిగి భారత రాజ్యాంగాన్ని రాసి స్థాయికి వచ్చినటువంటి వ్యక్తిని మనం అందరం ఆదర్శంగా తీసుకోవాలని, అంబేద్కర్ ఒక కులానికి ఒక ప్రాంతానికి నాయకుడు కాదని, యువత అంతా అర్థం చేసుకుని, అంబేద్కర్ చెప్పిన సిద్ధాంతాలను మనం ఆచరించాలని ఆయన అన్నారు, ఈ సమాజంలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి ఉన్నత వర్గాలతో పాటుగా పోటీపడే స్థాయికి తీసుకొచ్చిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని గుర్తు చేశారు, ఆయన భారత దేశంలో పుట్టక పోతే మన బతుకులు హీనంగా ఉండేవని ఆయన మరొక్కసారి గుర్తు చేశారు, ప్రత్యేక అతిథిగా పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతులకు వర్ధంతి లకు విగ్రహాలకు దండలేసి భోజనాలు ఏర్పాటు చేయటం కాదు అంబేద్కర్ చెప్పినటువంటి ఆలోచన విధానాన్ని ఆచరించి చూపాలని. మన పిల్లలు అంబేద్కర్ ఆలోచన విధానానికి అనుకూలంగా నడవాలని. అంబేద్కర్ అనేక అవమానాలు గురై మానసిక శోభతో మరణించినటువంటి విషయాన్ని ప్రతి ఒక్కరు కూడా గుర్తు చేసుకోవాలని ఆయన అన్నారు, యూత్ అంతా అంబేద్కర్ ఆశయాలకు ఆదర్శంగా నిలిచినప్పుడు మాత్రమే ఆయన ఆశయాలకు సార్థకత అవుతుందని పెంద్ర వీరన్న అన్నారు, ఈ కార్యక్రమంలో నల్లి జై వరప్రసాద్ , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభిమాన సంఘం, నేతల ప్రవీణ్ కుమార్, నేతల సునీల్ కుమార్, నల్లి రవి, దొండపాటి బాలు, నేతల రాజబాబు,పిల్లి యశ్వంత్, కొల్లాబాక్తుల రాజేష్, పాము జాషువా, జల్లి బిట్టు, సోడదాసి శ్రీధర్, కొలబాత్తుల రాంపండు, నేతల రమేష్, డొక్కమల్ల హేన్లి, తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ సమర్థవంతమైన వేదిక

**మండలస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష.**

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి నిస్వార్థంతో పని చేయాలి.**

**జిల్లా కలెక్టర్ నిషాంతి**

**ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు,(జయ జయహే)**





ఏప్రిల్ 13: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పిజిఆర్ఎస్ సమర్థవంతమైన వేదికగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పిజిఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.సోమవారం పాడేరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిజిఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యలకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యతాయుత చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు స్పందించాలని స్పష్టం చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సీఎం ఇన్సూరెన్స్ వర్క్స్, పీఎం జన్మన్, గ్రామీణ వికాస్, ఎన్ఆర్ఈజీఎస్, గృహ నిర్మాణము, వ్యవసాయ, పశు ఉత్పత్తి, ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధం, ఫారెస్ట్, ఆర్ ఓ ఎఫ్ ఆర్, ఆయా మండలాలలో ప్రస్తుతం జరుగుతున్న ఇంజనీరింగ్ పనులపై పురోగతి, ప్రగతి పై హారతిశారు. ఏ పనులు పెండింగ్ లేకుండా నిర్దేశించిన గడువులోపల పూర్తి చేయాలి అన్నారు.



## ఆయుధంతో కాదు.. కలంతో విజయం సాధించొచ్చు

**అనకాపల్లి (జయ జయహే)**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగాఅబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థపాక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేసిన ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మరియు వేల్పుల వీధి గర్ల్స్ హైస్కూల్లో అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూవిద్యార్థుల్లో చైతన్యం రావాలని అంబేద్కర్ ఆశయాలకు కృషిచేయాలనీ అన్నారు ఈ కార్యక్రమాన్ని ముందుగా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహిస్తూ అతిథులుగా ప్రధానోపాధ్యాయులు సంధ్య కుమారి మాజీ జిల్లా డివిఎంసి సభ్యులు రేపాక మధుబాబు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో శిల్పి ఆళ్ళ సాయి కుమార్,డివిఎంసి సభ్యులు బొడ్డేడ అప్పారావు జక్కుల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు జి, రాజు నేతాజీ, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రామయ్య, పోస్టల్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ వైబి పలసరావు, అబ్దుల్ కలాం సేవా సంఘం సోషల్ మీడియా ఇన్చార్జ్ ఆదారి పవన్, పసగాడా నాగేంద్ర, అబ్దుల్ కలాం సేవా సంఘం కార్యవర్గ సభ్యులు ఒ౨ భాష,ఉపాధ్యాయులు పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు అందరూ కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర తెలుసుకోవాలని అలాగే రాజ్యాంగం పై పూర్తి అవగాహన కల్పించుకోవాలని దేశం కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారని అవన్నీ కూడా మనం తెలుసుకోవాలని విద్య తోటి దేనినైనా సాధించగలమని ఆయన నిరూపించారని కనుక ప్రతి ఒక్కరు కూడా విద్యపై పూర్తి పట్టు సాధించాలని అన్నారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

## భోగాపురం వరకు మెట్రో


**రుషికొండ ఐటీ సెజ్ కు అనుసంధానించాలి**

**మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డితో గంటా**

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, జయ జయ హే**



రుషికొండ ఐటీ సెజ్ వరకూ మెట్రో సేవలు అందించాలని.. భోగాపురం వరకూ పొడిగించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. విశాఖ వచ్చిన మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని మెట్రో గురించి చర్చించారు. కొమ్మాది వరకు ప్రతిపాదించిన మెట్రో ను భోగాపురం వరకు పొడిగిస్తే ఎయిర్ పోర్టు యూజర్స్ కు ఉపయోగపడడంతో పాటు ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని గంటా అభిప్రాయపడ్డారు. రోడ్డు సౌకర్యం సహా మెట్రో కూడా అందుబాటులో ఉంటే విశాఖ నుంచి భోగాపురం వెళ్లే ప్రయాణికులు రాకపోకలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. రుషికొండలో కాగ్నిజెంట్, యాక్సెంచర్, టీసీఎస్ వంటి అంతర్జాతీయ ఐటీ సంస్థలు ఏర్పాటు కానుండడంతో మెట్రో లైన్ ను ఆ ప్రాంతానికి అనుసంధానిస్తే ఐటీ ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. విశాఖలో 4 కారిడార్ల కింద మొత్తం 76.90 కిలో మీటర్ల మెట్రోను ప్రతిపాదించినట్టు రామకృష్ణారెడ్డి వెల్లడించారు. మొదటిదశలో రూ. 11,498 కోట్లతో 46.23 కిలో మీటర్ల లైన్ నిర్మిస్తున్నామన్నారు. సుమారు 100 ఎకరాల భూ సేకరణ కోసం రూ. 882 కోట్లు వెచ్చిస్తున్నామని తెలియజేశారు. నేషనల్ హైవే మీదుగా 10 ఫ్లయ్ ఓవర్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలు అధిగమించవచ్చని చెప్పారు.




## బీచ్ రోడ్డులో బంగారు నాణేల విక్రయం

**ఆసక్తిగా తిలకిస్తున్న పర్యాటకులు**

**రూ. 800 విలువైన నాణేల విక్రయం**

**విశాఖపట్నం, ఏప్రిల్ 13, జయ జయహే**

మా చిన్నప్పుడు బజార్లో బంగారు నాణేలు రాశులు పోసి అమ్మేవారని పూర్వీకులు చెబుతుండేవారు. అప్పటి సంగతి మనకు తెలీదు కానీ ఇప్పుడు మాత్రం విశాఖ బీచ్ రోడ్డు పక్కన తోపుడు బండిపై బంగారు ఆభరణాలు, నాణేలు విక్రయిస్తున్నారు. బీచ్‌లో కనిపించిన ఈ దృశ్యం స్థానికులను, పర్యాటకులను ఆశ్చర్యానికి గురిచేసింది. వినియోగదారులను ఆకర్షించేందుకు నగరానికి చెందిన ఓ జ్యువెలరీ సంస్థ చేసిన ఈ వినూత్న మార్కెటింగ్ ప్రయోగం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. విశాఖపట్నం బీచ్ రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ఎదురుగా, అచ్చం ఐస్‌క్రీమ్ బండిలా కనిపించేలా తోపుడు బండిని ఆధునికంగా తయారు చేయించారు. 'గోల్డ్ ఆన్ వీల్స' పేరుతో ప్రారంభించిన ఈ బండి వద్దకు వచ్చిన వారికి, ఐస్‌క్రీమ్ ఇచ్చినట్లుగా బంగారాన్ని అందిస్తున్నారు. పాత రోజుల్లో రోడ్లపైనే బంగారం అమ్మేవారనే కాన్సెప్ట్‌తో ఈ సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఈ బండిని చూసిన జనం ఆసక్తిగా అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ బండిపై కేవలం రూ.800కే బంగారు నాణెం అందిస్తుండటం విశేషం. దీనిపై ఎలాంటి మేకింగ్ ఛార్జీలు కూడా లేవని చెబుతున్నారు. దాంతో చాలామంది ఆసక్తిగా కొనుగోలు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఈ బండిపై కేవలం తక్కువ విలువైన బంగారు వస్తువులను మాత్రమే విక్రయానికి ఉంచారు. ఖరీదైన ఆభరణాలన్నీ షోరూమ్‌లలోనే అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఈ బండిని ఏర్పాటు చేయగా, ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో మళ్లీ 18, 19, 20 తేదీల్లో కూడా అందుబాటులో వుంచుతామని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 5:30 గంటల నుంచి ఈ విక్రయాలు జరుపుతున్నారు.

# పార్టీలు వేర్వేరు...కబ్జాలకు ఏకమయ్యారు...!






- ఒకరిది వైసీపీ...ఇంకొకరిది టీడీపీ
- అర ఎకరా జీవీఎంసీ భూమి కబ్జాకు యత్నం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- రూ. కోట్ల విలువ చేసే భూమిపై రాబందుల కన్ను
- నకిలీ పట్టాలు సృష్టించి నొక్కేయాలన్న యత్నం
- స్థానిక విలేకరులకూ వాటాలు అందజేత

(జయ జయహే బ్యూరో - విశాఖపట్నం )

మహా విశాఖలో భూ ధరలు ఎలా మండిపోతున్నాయో అందరికీ తెలిసిందే. బీచ్ రోడ్డులో భూ సంగతి చెప్పుకుంటే ఇక మాటలే రావు. అంతా గజాల్లో చెబుతుంటే...బీచ్ రోడ్డులో మాత్రం బెత్తెడు చోటుకు రూ. లక్షల్లో చెబుతున్నారు. అలాంటి చోట దాదాపు అర ఎకరా భూమిని గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇద్దరు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారు. జీవీఎంసీ వేసిన ఫెన్సింగ్‌ను కొద్దికొద్దిగా తొలగిస్తూ ఆ భూమిని తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. సోమవారం ఆ భూమిని పూర్తిగా స్వాహా చేసేందుకు రంగంలోకి దిగిన సమయంలోనే ఆకాశరామన్న కబురు స్థానిక సచివాలయ ఉద్యోగులకు తెలీడంతో వారు ఆ భూమిలోకి అడుగెట్టేసరికి కబ్జాదారులు కాస్త చల్లగా జారుకున్నారు. అయినప్పటికీ ఈ భూమి తమదేనంటూ ఆ సచివాలయ ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఒరిజినల్ డాక్యుమెంట్స్ పట్టుకుని గట్టిగా సూచించడంతో పలాయనం చిత్తగించారు. ఇంతకీ ఆసక్తిగొలుపుతున్న ఈ సంఘటన ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలంటే ఖరీదైన ఆ బీచ్ రోడ్డులోకి వెళ్లాల్సిందే...!

బీచ్ రోడ్డులోని పెద రుషికొండ సచివాలయానికి కూత వేటు దూరంలోనే 1991లో శ్రీ కృష్ణా కో ఆపరేటివ్ సోసైటీ పేరిట ఓ లే అవుట్‌ను వేశారు. దీనికి అప్పటి వుడా పచ్చజెండా ఊపింది. నిబంధనల మేరకు స్థలాలన్నీ అమ్ముడయ్యాయి. అయితే అందులో రోడ్డు పక్కనే దాదాపు 46 సెంట్ల విస్తీర్ణం గల స్థలాన్ని పార్కు కేటాయించారు. అందులో జీవీఎంసీ ఓ ట్యాంక్‌ను నిర్మించి దాని ద్వారానే నీటి సరఫరాను చేస్తోంది. అయితే అదే ప్రాంతానికి చెందిన వ్యాయామ శాల నిర్వాహకుడు, టీడీపీ నాయకుడు రాంకీ, వైసీపీ నాయకుడు ఎరుపల్లి అప్పలరాజుల కన్ను పడింది. ఎవరి పార్టీ అధికారంలో ఉంటే వారు సమస్యను చక్కదిద్దుకుని కబ్జా చేసుకునేందుకు ఇరువురు ఏకమయ్యారు. వాస్తవానికి ఈ రెండు పార్టీలకు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనాలి కానీ...కోట్ల నోట్లు ఆ మంటలను చల్లార్చేశాయి. ఇద్దరూ ఏకమయ్యారు. ముందు కబ్జా చేసేసి చెరో సగం పంచేసుకునేందుకు పక్కా ప్రణాళికను సిద్దం చేసుకున్నారు. స్థానికంగా అడ్డొచ్చే విలేకరుల అడ్డు తొలగించుకోవడానికి కొంత ఉమ్మడి నిధిని ఏర్పాటు చేశారు. గట్టిగా మాట్లాడే విలేకరులందరికీ తాయిలాలు ఇచ్చేసి వాళ్ల నోళ్లు మూయించేశారు. రెవెన్యూ...జీవీఎంసీ అధికారక వర్గాలు కన్నేయకుండా స్థానిక ఎమ్మెల్యే...మంత్రి నారా లోకేష్ పేర్లను గట్టిగా వాడేసుకున్నారు. తమ జోలికి వస్తే వాళ్లు ఊరుకోరని మరీ హెచ్చరించారు. మొత్తానికి అన్నీ సవ్యంగా జరుగుతున్నాయనుకుని ఈ వారంలో పబ్లిక్ సెలవులు మూడు రోజులు ఉండడంతో అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడరు కదాని కబ్జా పర్వానికి తుది మెరుగులు దిద్దారు. ఇంత లోగా ఆ భూమిలో జీవీఎంసీ వేసిన ఫెన్సింగ్ పోల్స్‌ను తొలగిస్తున్నారంటూ స్థానిక సచివాలయానికి వచ్చిన ఫిర్యాదు మేరకు సచివాలయ కార్యదర్శి శ్యామలరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆ స్థలానికి ఫెన్సింగ్ వేయాలని అప్పటి వరకూ ఆ స్థలాన్ని సంరంక్షించే బాధ్యత చేపట్టినట్టు శ్యామలరావు ' జయ జయహే ప్రతినిధి' కి చెప్పారు. కబ్జాదారులపై ఫిర్యాదు చేయకుండా రెవెన్యూ, జీవీఎంసీ వర్గాలు నాటకమాడుతున్నాయని పెద రుషికొండ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ కబ్జాదారులు కన్ను పడినప్పటి నుంచీ ఆ స్థలంలోనే నిత్యం ఏదో పని చక్కబెడుతున్నారని దీనిపై పూర్తి విచారణ చేసి ఆ స్థలాన్ని రక్షించాలని కోరుతున్నారు.



# కొయ్యూరు గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

కొయ్యూరు :(జయ జయహే) న్యూస్ ఏప్రిల్ 14

అల్లూరి జిల్లా కొయ్యూరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న మండలస్థాయి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు, తహసీల్దార్ మురళీ బాబు ప్రజలకు సూచించారు. కలెక్టర్ నిషాంతి ఆదేశాల మేరకు నేడు గ్రీవెన్స్ నిర్వహించామన్నారు. భూములు, రెవెన్యూ సమస్యలపై రెండు ఫిర్యాదులు అందాయన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామన్నారు. ప్రజలు, సద్వినియోగం చేసుకోవాలన్నారు.




## జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులకు

# వైద్య చికిత్సలు

చోడవరం ఏప్రిల్ 13 జయ జయహే

చోడవరంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులకు సోమవారం మంచి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు తరచుగా అంటూ రోగాలు తగులుతున్నందున ప్రధానోపాధ్యాయులు స్పందించి విద్యార్థులను ఆసుపత్రి తరలించి తగిన వైద్య సేవలు అందించారు. ఈ పాఠశాల విద్యార్థులు కలుషిత ఆహారానికి గురయ్యారని రకరకాల పుకార్ల షికార్లు చేస్తున్న నేపథ్యంలో చోడవరం తహసిల్దార్ ఆస్పత్రి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. అలాంటిదేమీ లేదని విద్యార్థులకు దురదలో వంటివి సంభవించడంతో తగు వైద్య సేవలు అందించమని చెప్పారు. తమ పాఠశాలపై తప్పుడు ప్రచారం రావడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

# సామాన్య భక్తులకు సజావుగా దర్శనం: గంటా





సింహాచలం, ఏప్రిల్ 13: (జయ జయహే)

సామాన్య భక్తులకు సజావుగా స్వామివారి నిజరూప దర్శనం జరిగేలా చూడాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉత్సవ నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాకరంగా తీసుకుని ఈనెల 15 వ తేదీ నాటికే ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించిందని చెప్పారు. గత ఏడాది చందనోత్సవం నాడు చోటు చేసుకున్న దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా మంత్రుల కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షిస్తోందని తెలిపారు. సాధారణ రోజుల్లో స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సంఖ్యతో పోల్చుకుంటే చందనోత్సవం, గిరి ప్రదక్షిణ రోజుల్లో కనీసం 10 రెట్లు ఎక్కువ మంది వస్తారని వెల్లడించారు. ఆ సంఖ్యకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం యంత్రాంగానికి అతి పెద్ద సవాలన్నారు. ఈసారి చందనోత్సవానికి పూర్తి స్థాయి ఈఓ ఉన్న కారణంగా ఉత్సవం మరింత సమర్థంగా జరుగుతుందని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం ఇచ్చిన నియమావళిని స్వామి దర్శనానికి వచ్చే భక్తులు విధిగా పాటించాలన్నారు. దేవస్థానం నిర్దేశించిన స్లాట్ లలో దర్శనాలు చేసుకుని, మిగిలిన భక్తులకు ఇబ్బంది కలిగించకుండా సహకరించాలని కోరారు.

### ఏర్పాట్లను సమీక్షించిన గంటా

ఈనెల 20 న జరగనున్న చందనోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే గంటా పరిశీలించారు. క్యూ లైన్లు, మంచినీటి సౌకర్యం, రవాణా, ప్రసాదాలు, పార్కింగ్ తదితర అంశాల గురించి ఈఓ జె. వెంకట్రావు వివరించారు. ఆన్ లైన్, ఆఫ్ లైన్లలో జారీ చేస్తున్న టికెట్లు.. వాటి స్లాట్ వివరాలు తెలియజేశారు.

### చందనం అరగదీత

చందనోత్సవాన్ని పురస్కరించుకుని గంటా శ్రీనివాసరావు సింహాచలం ఆలయంలో చందనం చెక్కను అరగదీశారు. సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న అనంతరం సంప్రదాయ దుస్తులలో ఆయన గంధపు చెక్కను అరగదీశారు. సంవత్సమంతా చందనంతో నిండి ఉండే నృసింహ స్వామి ఒక్క చందనోత్సవం రోజున మాత్రానే నిజరూప దర్శనమిస్తారు. ఈ ఉత్సవం అనంతరం స్వామి వారిని కప్పడానికి చందనాన్ని సిద్ధం చేసే క్రమంలో సోమవారం నుంచి గంధం అరగతీత ప్రారంభించారు. ఈఓ జె. వెంకట్రావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు, గాడు వెంకటప్పడు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వైస్సార్సీపీ నాయకులు మాంసాహార విందు ఏర్పాటు

## ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన టిడిపి నాయకులు

## చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన కొప్పిశెట్టి వెంకటేష్

నక్కపల్లి, ఏప్రిల్ 13: (జయ జయహే)

ఉత్తరాంధ్రలో ప్రాచీన క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక కళ్యాణం ఘనంగా నిర్వహించబడుతుంది. ఆలయ ప్రాంగణంలో వివాహాలు జరుగుతున్న సందర్భాల్లో సంప్రదాయంగా శాఖాహార విందులు మాత్రమే ఏర్పాటు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే, ఆదివారం రాత్రి ఎస్. రాయవరం మండలానికి చెందిన వైసిపీ నాయకుడు, వైస్ ఎంపీపీ అప్పన్న సోదరుడి వివాహ వేడుకల్లో భాగంగా ఆలయ సన్నిధిలోనే మాంసాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట నియోజకవర్గ వైసిపీ ఇంచార్జ్ కంబాల జోగులు సహా పలువురు నాయకులు హాజరై మాంసాహారం విందు ఆరగించారు.ఈ ఘటనతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై స్పందించిన పాయకరావుపేట టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, ఆలయ ప్రాంగణంలో మాంసాహారం విందు ఏర్పాటు చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై నక్కపల్లి పోలీస్ స్టేషన్లో టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఉపమాక సర్పంచ్ వీరబాబు నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, పాయకరావుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు షేక్ మునిసా బేగం,వాసు తదితరులు పాల్గొన్నారు.




# హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు జాతీయ గుర్తింపు

## 2026"లో బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫెసిలిటీస్ గుర్తింపు

అనంతపురం జయ జయహే

అనంతపురం జిల్లాలోని హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు సాధించింది. 2026 సంవత్సరానికి గాను నిర్వహించిన "నేషనల్ స్కూల్ అవార్డు సమిట్"లో ఈ పాఠశాల బెస్ట్ ఎడ్యుకేషనల్ ఫెసిలిటీస్ అవార్డును అందుకుంది.బెంగళూరులో జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధి పి. ప్రతాప్ రెడ్డి అవార్డును స్వీకరించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల మధ్య ఈ అవార్డు సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పాఠశాల ఆధునిక సదుపాయాలు అందిస్తోంది. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా వసతులు, సృజనాత్మక కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ అంశాలే ఈ అవార్డు సాధనకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉత్తమమైన విద్యా వాతావరణం కల్పించడం మా లక్ష్యం. ఈ అవార్డు మా కృషికి గుర్తింపుగా భావిస్తున్నాం" అని జీఎం రామసుబ్బారెడ్డి, ఏజీఎం శంకర్ నారాయణ తెలిపారు. ఈ విజయంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.



నిష్పత్తి కుదిరితేనే..

## ముద్దముద్దలో ఘాటు

భారతీయుల వంటగదిలో అల్లం-వెల్లుల్లి పేస్ట్ కచ్చితంగా ఉండాల్సిందే! శాకాహారమైనా, మాంసాహారమైనా.. ఓ టేబుల్ స్పూన్ అల్లం, వెల్లుల్లి ముద్ద పడాల్సిందే! అయితే, ప్రస్తుత కల్తీల కాలంలో.. అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ను ఇంట్లో తయారు చేసుకోవడమే మంచిది! అయితే, దీన్ని నిల్వ ఉంచితే కొద్ది రోజులకే రుచి మారిపోతుంది. అలాకాకుండా.. అల్లం-వెల్లుల్లి ముద్ద ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి.

అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీలో రెండిటినీ సరైన నిష్పత్తిలో తీసుకోవడం ముఖ్యం. 60 శాతం వెల్లుల్లి ఉంటే.. 40 శాతం అల్లం ఉండేలా చూసుకోవాలి. రెండింటి పొట్టును పూర్తిగా తీయాలి. లేకుంటే, దానిపై ఉండే తొక్క వల్ల పేస్ట్ రుచి మారుతుంది. త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది.

నిల్వ ఉంచేవి ఏవైనా.. తేమ తగిలితే పాడవుతాయి. అల్లం-వెల్లుల్లి పేస్ట్ కూడా అంతే! అందుకే, అల్లం ముక్కలను శుభ్రంగా కడిగిన తర్వాత.. తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాతే మిక్సీ పట్టుకోవాలి. దీనివల్ల పేస్ట్ ఎక్కువకాలం తాజాగా ఉంటుంది.

ఈ పేస్ట్‌కు ఒకటిన్నర టేబుల్ స్పూన్ పల్లి నూనె గానీ, పొద్దుతిరుగుడు నూనె గానీ, ఒక టీ స్పూన్ ఆలివ్ నూనె గానీ, కొద్దిగా ఉప్పు కలుపుకోవాలి. దీనిని గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. నూనెలు, ఉప్పు సహజసిద్ధమైన ప్రిజర్వేటివ్‌లా పనిచేస్తాయి. పేస్ట్ ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేస్తాయి.

అప్పుడప్పుడూ అల్లం-వెల్లుల్లి పేస్ట్ ఆకుపచ్చ లేదా పసుపు రంగులోకి మారుతుంటుంది. ఇలా రంగు మారడం పేస్ట్ పాడవుతున్నది అనడానికి ఓ సంకేతం! మిశ్రమంలో టీస్పూన్ నిమ్మరసం వేసి కలిపి, గాలి చొరబడని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే.. తాజాగా ఉంటుంది.

# భద్రం.. బీ కేర్‌ఫుల్ బ్రదర్

## ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే అంతే సంగతి



ప్రతీ ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అయితే అది లేక కొందరు, అది ఉన్నప్పటికీ అవగాహన లేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని మరికొందరు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకుంటున్నారు. మరి నిపుణులేమంటున్నారో చూద్దాం.

### అవగాహనతో..

ప్రతీదానిపై అవగాహన ఉంటేనే లాభమైనా.. విజయమైనా దక్కుతుంది. ముఖ్యంగా ఎలాంటి అవగాహన లేకుండా, విచారణ చేయకుండా తొందరపడి నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. స్టాక్ మార్కెట్లపై విశ్లేషణ చేసి, పూర్తిగా రిసెర్చ్ చేశాకే ఓ నిర్ణయానికి రావడం ఉత్తమం. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచుకోవడానికి అసలు సమయమే లేని చిన్న మదుపరులు ఈ పెట్టుబడులకు దూరంగా ఉండటమే లాభదాయకం. అయితే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు దిగడం ఒకింత తెలివైన పనేనని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ మీకొచ్చే ఆదాయం మార్కెట్ ఒడుదొడుకులకు లోబడే ఉంటుందన్నది మరువద్దు. మొత్తానికి ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం.

### అతితో అనర్థాలే..

కొందరు ఏం చేసినా అపరిమిత స్థాయిలోనే ఉంటుంది. ఈ క్రమంలోనే విపరీతంగా స్టాక్స్‌ను కొంటూంటారు. అలాగే ఫండ్స్‌నూ అదేస్థాయిలో రకరకాల పెట్టుబడి సాధనాల్లోకి మళ్లిస్తూ ఉంటారు. అయితే వైవిధ్యం అనేది వ్యూహమే అయినా.. ఒక మోతాదు దాటితే దుష్పరిణామాలకే దారితీస్తుంది. ఓ సర్వే ప్రకారం మీ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాల నుంచి 15-20 శాతం స్టాక్స్.. మీకున్న రిస్క్‌ను తగ్గిస్తుంది. ఇంతకు మించితే ఎటువంటి లాభమూ దక్కదు. కాబట్టి స్టాక్స్ కొనుగోలు, నిధుల మళ్లింపుల్లో అతి పనికిరాదు.

### బీమాను మరువద్దు

ప్రతీది పన్ను కోణంలో చూడవద్దు. పెట్టుబడులైనా, బీమా అయినా పన్ను మినహాయింపులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా బీమా పాలసీల విషయంలో ఈ రకమైన ఆలోచన శ్రేయస్కరం కాదు. ఎందుకంటే పన్ను మినహాయింపుల కోసం బీమా పాలసీలను తీసుకుంటే.. కావాల్సిన ప్రయోజనాలను మీరు కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు అవసరమైన బీమాలో భాగంగానే పన్ను ప్రయోజనాలు దక్కలిగానీ.. మొత్తం పాలసీనే నిరుపయోగంగా మార్చవద్దని హితవు పలుకుతున్నారు. అలాగే సమగ్రరీతిలో కవరేజీ ఉన్న పాలసీలనే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒకటికి మించి బీమా పాలసీలుంటే మంచిదే అయినప్పటికీ.. మీమీ ఆర్థిక అనుకూలతలనూ పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

### రుణ భారం

అవసరమున్నా, లేకున్నా నేడు చాలామంది మితిమీరిన రుణ భారాన్ని తలకెత్తుకుంటున్నారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థల నుంచి వస్తున్న ఆఫర్లతో కొందరు.. క్రెడిట్ కార్డు సంస్థల నుంచి వస్తున్న ప్రకటనలతో మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనివల్ల జీవితంలో రాజీపడి బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. కాబట్టి అప్పుచేసి పప్పుకూడు ఎప్పటికీ మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయ-వ్యయాల మధ్య అంతరాలను తెలుసుకొని జీవించాలంటున్నారు. అనవసరపు కోర్కెలను తీర్చుకోవడానికి చేసే అప్పులు.. మున్ముందు గృహ రుణం వంటి కీలక లక్ష్యాల సాధనను ఆంటకపర్చే వీలుకూడా లేకపోలేదు. కాబట్టి అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

### చివరగా..

ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక స్థోమతను తెలుసుకొని ప్రవర్తించాలి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో స్థిరత్వం లోపించింది. ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే కనీసం 6 నెలల అవసరాలు తీరేలా అత్యవసర నిధి ఉండాలి. సురక్షితమైన పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే.. పొదుపునకూ ప్రాధాన్యత ఇవ్వాలి. వీలుంటే రుణ భారాన్ని తగ్గించుకోవాలి. అవసరం మేరకే ఖర్చులుండాలి. విస్తృత శ్రేణి ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను తీసుకోండి. అడ్డగోలు రాబడులనిచ్చే మోసపూరిత స్కీములకు దూరంగా ఉండండి. తొందరపాటుతో కాకుండా ఓ ప్రణాళికతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి.

### పొదుపుతోనే రక్ష

పొదుపును ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు. ప్రతీ వ్యక్తికి ఉండాల్సిన ఆర్థిక క్రమశిక్షణలో తెలివైన పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. పొందికైన పొదుపునకూ అంతే స్థానం ఉంటుంది. యుక్త వయస్సు నుంచే సేవింగ్స్‌ను అలవాటు చేసుకుంటే ఆకర్షణీయ లాభాలను పొందవచ్చు. ముఖ్యంగా అనుకోని ఖర్చులను తేలిగ్గా అధిగమించవచ్చు. ఇక నేటి యువతలో చాలామందికి కెరియర్ ప్రారంభంలోనే మంచి ఉద్యోగాలు, పెద్ద జీతాలు దక్కుతున్నాయి. అయితే క్రెడిట్ కార్డులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు.. ఇలా లైఫ్‌ను ఎంజాయ్ చేయడంపైనే దృష్టి పెడుతున్నారు. కానీ అత్యవసర పరిస్థితుల కోసం సేవింగ్స్‌పై మాత్రం మొగ్గు చూపడం లేదు. కనుక పొదుపుపై నిర్లక్ష్య ధోరణి వీడాలి.

## నువ్వులను ఇలా వాడితే మీ ముఖం

# కాంతివంతంగా మారి మెరిసిపోతుంది



నువ్వులను మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. నువ్వుల నుంచి తీసిన నూనెను కూడా మనం వాడుతుంటాం. నువ్వుల్లో ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని సంరక్షించి కాంతిని ఇస్తాయి. చర్మంపైన ఉండే పొరను రక్షిస్తాయి. నువ్వుల్లో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. అందువల్ల నువ్వులు చర్మ సౌందర్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. నువ్వుల నుంచి తీసిన నూనెనే ముందుగా మానవులు వాడడం మొదలు పెట్టారని చరిత్ర చెబుతోంది.

మనిషి నువ్వుల నూనెనే ముందుగా వాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. నువ్వుల నూనెలో మెగ్నిషియం, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ఐరన్, అనేక రకాల బి విటమిన్లు, విటమిన్ ఇ, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఒక టీస్పూన్ నువ్వుల పొడిని తీసుకుని అందులో ఒక టీస్పూన్ పెరుగు వేసి కలపాలి. ఇందులోనే చిటికెడు పసుపు వేయాలి. కొన్ని చుక్కల తేనె వేసి బాగా కలపాలి. దీంతో ఫేస్ ప్యాక్ రెడీ అవుతుంది. దీన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాలు అయ్యాక చల్లని నీటితో కడిగేయాలి. దీని వల్ల ముఖంపై ఉండే రంధ్రాలు మూసుకునిపోతాయి, చర్మానికి తేమ లభిస్తుంది. చర్మం టైట్‌గా మారి కాంతివంతంగా తయారవుతుంది.

1 టీస్పూన్ నువ్వుల పొడిని తీసుకుని అందులో కొన్ని చుక్కల పాలు లేదా తేనె కలిపి ఒక స్క్రబ్ క్రియేట్ చేయాలి. దీన్ని అప్లై చేస్తుంటే ముఖంపై ఉండే మృత చర్మ కణాలు పోతాయి. మురికి, ధూళి, దుమ్ము కూడా పోతాయి. నువ్వుల నూనెను మీరు ముఖానికి నేరుగా కూడా అప్లై చేయవచ్చు. నువ్వుల నూనెను ముఖానికి రాసిన తరువాత కాసేపు ఆగి కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మానికి మెరుపు లాంటి లుక్ వస్తుంది. చర్మం కాంతితో మెరిసిపోతుంది.

అర కప్పు నువ్వుల నూనె, అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్, పావు కప్పు నీళ్లను తీసుకుని బాగా కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి రాత్రి పూట రాయాలి. మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే చర్మం టైట్‌గా మారుతుంది. చర్మం మృదువుగా తయారవుతుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది.

2 కప్పుల బ్లాక్ టీనికాచి అందులో 3 టేబుల్ స్పూన్ల నువ్వులను వేయాలి. మిశ్రమాన్ని చల్లార్చిన తరువాత వడకట్టాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరిపాలను కలపాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని కంటెయినర్‌లో నిల్వ చేయాలి. దీన్ని రోజూ ఉదయం క్లీన్సర్‌లాగా వాడుకోవచ్చు.

ఒక టేబుల్ స్పూన్ నువ్వుల పొడి, ఒక టేబుల్ స్పూన్ పెరుగు, తేనె కలిపి మిశ్రమంగా చేసి ఈ ఫేస్ ప్యాక్‌ను ముఖానికి రాయాలి. కొంత సేపు అయ్యాక కడిగేయాలి. వారంలో ఇలా 2 సార్లు చేయాలి. దీంతో చర్మం తిరిగి పూర్వ రూపాన్ని పొందుతుంది. ఇలా నువ్వులు లేదా నువ్వుల పొడి, నువ్వుల నూనెను వాడి చర్మ సౌందర్యాన్ని పెంచుకోవచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com